నల్లబొంత

శ్రీ వి. వి. యన్. రామదాసు

'ఆ ముసలిది పోవడంతోనే శని విరగడయిం దనుకున్నాను' కాని, దాని నల్లబొంతను మీరు వదలకుండా ఉన్నారేమండీ?' అన్నది లలిత భర్త రామారావుకి కాఫీ అందిస్తూ.

"అది సరే కాని ఆమె అంటే నీ కెందు కంత కోపం? గర్భిణి స్త్రీలకు కోపం మంచిది కాదు" అన్నాడు రామారావు కాఫీ పుచ్చుకుంటూ.

"నా కోపం ఎందువల్ల నయితే నేం? ఆ ముసలిదానిమీద మీ కెందు కంత భక్తి? దానిపీడ విరగడయినా దాని నల్లబొంత అవతల పడేద్దామంటే ఒప్పుకోరేం? దాని బొంతమీద మీకెందుకండీ అంత మమకారం?" అన్నది లలిత.

"ఇవ్వాళ ఆదివారంకదా? ఆ నల్లబొంత సంగతి భోజనా లయాక చూద్దాం. ఇప్పటికి వెళ్ళు" అని అప్పటికి తప్పించుకున్నాడు రామారావు.

"ఏమయినా ఇవ్వాళ దాని సంగతి తేలవలసినదే" అంటూ లలిత వంటగదిలోకి వెళ్లింది.

ఆమె కెలా నచ్చచెప్పాలో అతనికి తోచలేదు.

రామారావు ఈజీచైరులో కూర్చుని ఆలోచించాడు.

నలుగురూ 'మామ్మగారూ' అని పిలచే నారాయణమ్మగారు రామారావుకి చిన్నప్పుడు చేసిన ఉపకారం అత డీ జన్మలో మరువ లేడు. ఆమె చేసిన ఉపకారం గురించి లలితకు చెప్పలేకపోవడానికి కారణం రామారావు చిన్నప్పుడు వారాలు చేసుకుని చదువుకున్న సంగతి ఆమెకు తెలియకూడదని అతని తాపత్రయం. అంతకంటె ముఖ్యంగా 'మామ్మగారు' చేసిన మహోపకారం ఎవరికీ చెప్పడానికి వీలులేనిది.

* * *

రామారావు తల్లి చిన్నప్పుడే పోయింది. అతనికోసం అతని తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోలేదు. పౌరోహిత్యం చేసుకుంటూ అతనిని పెంచసాగాడు. ఆ కుగ్రామంలో అయిదవ తరగతివరకు మాత్రమే చదువుండేది. అదయిన తరువాత పట్నంలో కాపురం పెట్టి హైస్కూలు చదువు, కాలేజీ చదువు యింకా పెద్ద చదువులు ఎవెవించుదామనీ తరువాత పెద్ద ఉద్యోగం వస్తుందనీ అతని తండ్రి ఏవో కలలు కన్నాడు.

కాని రామారావు అయిదవ తరగతి చదువుతూఉండగానే అతని తండ్రి గతించాడు. తండ్రిపోయిన పది రోజులకు ఆ గ్రామంలో ఆదరించేవారెవరూ లేరని అతనికి అర్థమయింది.

ఒకనాటి సాయంత్రం పుస్తకాలూ, ఉన్న రెండు జతల బట్టలూ మూట కట్టుకుని బయలుదేరి కాలినడకను ఆ గ్రామానికి పన్నెండు మైళ్లదూరంలోవున్న పట్నం చేరాడు. పట్నంలో మొదటి వీధి మొదటి యింటి అరుగుమీద పడుకుని నిద్రపోయాడు.

రామారావు నిద్ర లేచేసరికి, "ఏ వూరు నీది నాయనా? ఎవరబ్బాయివి బాబూ?" అని ఎంతో ఆదరంగా పలకరించిన నారాయణమ్మగారి గొంతు వినబడింది.

అతని దీనచరిత్రవిన్న నారాయణమ్మ జాలిపడింది

అప్పటికి నలభై ఏళ్లు మాత్రమే వయసున్న నారాయణమ్మ ఎక్కువ వయసున్న ఆమెలా కనిపించేది అప్పటికే ఆమె నందరూ 'మామ్మగారూ' అని పిలచేవారు. కనీసం 'దొడ్డమ్మగారూ' అనో, 'పిన్నిగారూ' అనో పిలవలేదని ఆమె ఎప్పుడూ విచారించలేదు.

కూతురి పెళ్లి చేసిన సంవత్సరం దాటకముందే నారాయణమ్మకు వైధవ్యం సంభవించింది. ఒక్కర్తే కూతురవడం వల్ల అల్లుని యింటికి వచ్చి కూతురికి సాయంగా ఉండిపోయింది. అల్లునికి కూడా వేరే పెద్ద దిక్కులేక ఆమె ఉండడాన్ని కాదనలేకపోయాడు. కాదనలేవపోవడానికి మరొక ముఖ్య కారణం ఆమెకున్న ఆస్తి.

ఆ పట్నం మునిసిపాలిటీలో పనిచేస్తూ అత్తగారి ఆస్తి వ్యవహారాలు చూస్తూ ఉండేవాడు నారాయణమ్మ అల్లుడు.

రామారావు దీన చరిత్ర విని జాలిపడిన నారాయణమ్మ అతనికి ఆశ్రయం యివ్వాలని ప్రయత్నించింది. కాని కూతురూ అల్లుడూ వ్యతిరేకించడంవల్ల వారం రోజుల్లో ఒకరోజు భోజనం పెట్టడానికి మాత్రమే అంగీకరింప చేయగలిగింది తన పలుకుబడిని వినియోగించి నారాయణమ్మ ఇంకా ఆరుగురి యిళ్లల్లో ఆరు వారాలు రామారావు భోజనం చేయడానికి ఏర్పాటు చేసి పెట్టింది.

ఆమె పట్టుపట్టడంవల్ల ఆమె అల్లుడు రామారావుని బడిలో అయిదవ క్లాసులో చేర్పించాడు.

నల్లబొంత

ఆమె ఎంతో బ్రతిమాలినమీదట వీధి వసారాలో చదువుకుని పడుకోనియ్యడానికి ఆమె అల్లుడు అనుమతించాడు.

రామారావు చందాలు ప్రోగుచేసి జీతం కట్టేవాడు. కాని చందా పుస్తకం పట్టుకుని తిరిగేటప్పుడల్లా అతని మనస్సు కష్టపడేది రైలు స్టేషను దగ్గరా, రైలు బళ్ళలోను, బస్సుస్టాండుల దగ్గరా ప్రయాణికులను చందాలు యాచిస్తున్నప్పుడు అతని నిజాయతీని శంకిస్తూ నలుగురూ నాలుగు విధాల అనే మాటలు అతనికి శూలాలలా తగిలేవి.

రామారావు అదృష్టంవల్ల పుస్తకాలు మారలేదు అయిదవ తరగతి మంచి మార్కులతో పాసయినాడు.

ఆరవ తరగతిలో ప్రవేశించేనాటికి పుస్తకాలు కొనవలసిన సమస్య ఎదురయింది పాత పుస్తకాలు అమ్మేశాడు. ఆ డబ్బుతో ఎక్సర్సయిజు పుస్తకాలు కొన్నాడు. తన తరగతికంటె పై తరగతిలో చదువుకున్న ఒక కుర్రవాడు అతనియందు దయచూపి పుస్తకా లిచ్చాడు. కాని లెక్కల పుస్తకం మారిపోయింది.

లెక్కల పుస్తకం కొని తీరాలని లెక్కల మాస్టారు పట్టుపట్టారు ఒకటి రెండు రోజులు బెంచీ ఎక్కించి తరువాత, "రేపు లెక్కల పుస్తకం కొని తేకపోతే క్లాసునుంచి బయటకు తరిమేస్తాను" జాగ్రత్త అని హెచ్చరించాడు.

బడి విడిచిన తరువాత రామారావు పుస్తకాల షాపుకి వెళ్ళి, ఆరవ తరగతి లెక్కల పుస్తకం ధర ఎంత?" అని అడిగాడు "రూపాయి పావలా" అని చెప్పాడు దుకాణదారుడు.

"ఒకవారం రోజులలో డబ్బు తెచ్చియిస్తాను. అరువు యిస్తారా?" అని అడిగాడు.

"అరువు రేపు — ఇవ్వాళ నగదే" అని వ్రాసివున్న బల్ల చూపించా డాయన

ఆ రాత్రి ఎవరింటి దగ్గర భోజనం చేశాడో ఆ యింటాయనతో చెప్పాడు రామారావు. ఆయన డబ్బు యివ్వలేకపోయాడు. కాని, "ఫరవాలేదు లే. మీ లెక్కల మాస్టారుతో నేను మాట్లాడతాను. నిన్నెప్పుడూ పుస్తకం గురించి అడగకుండా చూస్తాను" అన్నాడు

లెక్కల మాస్టారు ఎవరు చెప్పినా వినరన్న సంగతి రామారావుకి బాగా తెలుసు. అదీకాక లెక్కల పుస్తకం ఉంటే బాగుండునని తనకు కూడా ఉంది

"సరేనండి" అని నారాయణమ్మగారింటికి వెళ్ళి చదువుకోవాలని కూర్చున్నాడే కాని అతని మనసంతా లెక్కల పుస్తకం కొనడానికి కావలసిన రూపాయి పావలామీదనే ఉంది.

రాత్రంతా లెక్కల మాస్టారి భయంకర రూపమే అతని కలలోకి వచ్చింది క్లాసునుంచి బయటకు పంపించినట్లు కల కని ఉలిక్కిపడి లేచాడు.

మరునాటి ఉదయం నూతి దగ్గర స్నానం చేసివచ్చి సావిట్లోకి తిన్నగా రావలసినవాడు మధ్యగదిలోకి వెళ్ళాడు. ఆ ఇంటా 'మామ్మగారు' అతనికిచ్చిన చనువువల్ల అత డే గదిలోకి వెళ్ళినా ఎవరూ ఏమీ అనేవారు కారు

బల్లమీద ఉన్న చిల్లర అతని కంటపడింది బల్ల దగ్గరకు వెళ్ళాడు. తప్పు చేస్తున్నాననే వ్యాకులత ఒక ప్రక్క పీడిస్తున్నప్పటికీ లెక్కల మాస్టారు ముఖం జ్ఞాపకానికి వచ్చి చిల్లర చేతిలోకి తీసుకున్నాడు. తనకు కావలసిన రూపాయి పావలా తీసుకుని తక్కినది బల్లమీదనే ఉంచాడు. తను ఆ పని చేస్తూండగా ఎవరూ చూడలేదనుకున్నాడు కాని వంటగదిలోనుండి చూస్తున్న నారాయణమ్మగారి కంటపడిన సంగతి అతడు గమనించలేదు. నారాయణమ్మగారి కూతురు పెరట్లో ఉండడంవల్ల ఆమె చూడలేదు. గబగబా వసారాలోకి వెళ్ళి బట్టలు వేసుకున్నాడు.

ఆ రూపాయి పావలా చొక్కా జేబులో వేసుకుని ఏమీ ఎరుగనట్టు, పుస్తకం చదువుతున్నట్లు నటించాడు

"ఏమే ఈ బల్లమీద పెట్టిన చిల్లరలో రూపాయి పావలా తక్కువయిం దేమి? నువ్వు తీశావా?" అని నారాయణమ్మగారి అల్లుని గొంతు వినిపించింది.

"నేను తియ్యలేదండీ" అని పెరట్లోనుంచి వస్తూ అన్న నారాయణమ్మగారి కూతురి కేక వినిపించింది.

వసారాలోవున్న రామారావు గుండెలు వేగంగాకొట్టుకున్నాయి.

"పనిమనిషి ఇంతకుమునుపే వెళ్ళింది కదా?" అని అల్లుని గొంతు వినిపించింది.

ఇంక తన దగ్గరకు వచ్చి అడుగుతారేమోనని రామారావు భయపడ్డాడు.

"నేనే తీశాను నాయనా బొత్తిగా చిల్లరలేక అవస్థగా ఉంది" అన్న నారాయణమ్మగారి గొంతు వినిపించడంతో రామారావు భయం తగ్గింది

"అలా చెప్పండి. దొంగవాళ్ళయితే అంతా తీసుకుంటారు గాని కొంత వదిలి పెడతారా?" అన్న అల్లుని గొంతు వినిపించింది.

రామారావు గబగబా పుస్తకాలు తీసుకుని, "వెళ్ళొస్తానండి, మామ్మగారూ" అని చెప్పేసి బజారుకు వెళ్ళాడు.

లెక్కల పుస్తకం కొని మాస్టారి ఆగ్రహం తప్పించుకున్నాడు కాని, దొంగతనం చేశానే అన్న కించ అతనిని పీడిస్తూనే ఉంది.

ఆ సాయంత్రం మామ్మగారి పాదాలమీద పడి చేసిన తప్పు ఒప్పుకుని క్షమాపణ వేడుకుందా మనుకున్నాడు

రామారావు వేరే ఇంట్లో భోజనం చేసి 'ఇంటి'కి వెళ్ళేసరికి మామ్మగారు ఒక్కరే వీధి అరుగుమీద కూర్చున్నారు.

"భోజనం చేశావా నాయనా?" అని ఎంతో మృదువుగా అడిగా రామె.

"చేశానండి. బాబుగారూ, అమ్మగారూ లేరా?" అన్నాడు రామారావు.

"లేరు నాయనా, సినిమాకి వెళ్లారు" అన్నదామె.

"మామ్మగారూ"అని ఏడుస్తూ ఆమె కాళ్లు పట్టుకున్నాడు.

"ఛ ఛ ఏమిటి బాబూ అది ? లోపలికి పోదాం పద" అన్నదామె.

లోపల వీధి వసారాలోకి వెళ్లి చాపమీద కూర్చుంది నారాయణమ్మ.

ఆమెకు ఎదురుగా నిలబడి రామారావు, "మామ్మగారూ ఉదయం నేను బాబుగారి బల్లమీదనుంచి రూపాయి పావలా దొంగతనం చేశాను'' అన్నాడు.

"ఎందుకలా చేశావు బాబూ?" అన్నదామె.

"లెక్కల పుస్తకం లేదు. అది లేకుండా క్లాసుకి వస్తే క్లాసు నుంచి బయటకు పంపిస్తామన్నారు లెక్కల మాస్టారు బుద్ధిగడ్డి తిని దొంగతనం చేశాను. బాబుగారి కాళ్లమీదపడి క్షమాపణ వేడుకుంటాను" అన్నాడు రామారావు.

"ఆ పనిమాత్రం చెయ్యకు నిన్ను క్షమించడానికి బదులు నిన్నొక దొంగవానిక్రింద జమకడతారు ఇంక నీ కెక్కడా ఆశ్రయం దొరకదు దానివల్ల నీ చదు వాగిపోతుంది. అందుచేతనే నేను అబద్ధం ఆడవలసి వచ్చింది'' అన్నదామె.

"మరి నన్ను పీడిస్తున్న ఈ బాధ ఎలా పోతుంది మామ్మగారూ?''

"నాతో చెప్పావు కదా. ఇక బాధపడకు. దొంగతనం చేసిన నిన్నూ, అబద్ధం ఆడిన నన్నూ ఆ భగవంతుడే క్షమిస్తాడు. ఇక చదువుకో బాబూ" అన్నదామె.

రామారావు పుస్తకాల ముందుర కూర్చున్నాడు.

"చూడు బాబూ. ఇకనుంచి నీ కెప్పుడు డబ్బు కావాలన్నా నన్నడుగు. నేను నీకు నిజంగానే 'మామ్మ' ని అనుకో'' అని చెప్పి నారాయణమ్మ వీధి అరుగుమీదికి పోయి కూర్చుంది.

ఆమె ఒక అబద్ధం ఆడి అధఃపతనం కాబోయే అతని జీవితాన్ని ఉద్ధరించింది. చీకటి త్రోవను పోయేవానికి వెలుగు చూపించింది.

నాటినుంచి రామారావు దొంగతనం చెయ్యలేదు.

నారాయణమ్మగారు అతని కెన్నో హితోపదేశాలు చేసి అతని శీలానికి పునాదులు వేసింది. ఆమె అతని నెప్పుడూ పొగడలేదు. నిజాని కామె ఎవరినీ పొగడదు. అందుచేతనే ఆమెవల్ల ఎంత ఉపకారం పొందినవారైనా ఆమెపట్ల ముభావంగా ఉంటారు.

లెక్కలలో నూటికి తొంభై మార్కులు వచ్చిన రోజున ఉత్సాహంగా ప్రోగ్రెసు రిపోర్టు 'మామ్మ'గారికి చూపించాడు. ఆమె కళ్లలో ఆనందం కనిపించినా అంతలోనే సీరియస్‌గా ముఖం పెట్టి, "ఏంరా, నూటికి తొంభై మార్కులు వచ్చాయని గర్వ పడుతున్నావా? తక్కిన పది మార్కులు ఎందుకు రాలేదు?'' అని గద్దించింది.

రామారావు బిక్కమొహం వేశాడు. అప్పటినుంచి లెక్కలలో మాత్రం నూటికి నూరు రావలసిందే. తక్కిన పేపర్లలో ఎనభైలు వచ్చి, తరగతిలో ప్రథముడుగా ఉన్నప్పటికీ 'మామ్మ'గారి దగ్గర మార్కులు చూపించడానికి భయపడేవాడు.

ఎనిమిదవ తరగతికి వచ్చేసరికే చందాల పుస్తకం పట్టుకుని తిరగడం అంటే అతని కెంతో లజ్జాకరంగా ఉండేది. ఆ సంగతి మామ్మగారికి చెప్పగా ఆమె ధనార్జనకు కష్టపడి పని చేయ్యడంలో ఉన్న గౌరవాన్ని బోధించింది. ప్రతి ఉదయం వార్తాపత్రిక లమ్మడం, శని ఆదివారాల్లో పాత పేపర్లూ, పుస్తకాలూ, డబ్బాలూ కొని అమ్మడం ద్వారా చందాల పుస్తకం పట్టుకుని తిరగడం తప్పించుకోగలిగాడు.

స్కూలు ఫైనలు పాసయేనాటికి యింక వారాలు చేసుకుని చదవడం అతనికి ఆత్మగౌరవానికి భంగకరంగా అనిపించి పై చదువులు చదవాలనే ఆశలు వదులుకున్నాడు.

అమ్మకంలో అతనికున్న నేర్పును మెచ్చుకున్న ఒక మెడికల్ స్టోర్సు యజమాని అతనిని సేల్సుమాన్‌గా నియమించాడు అతని వాక్చాతుర్యాన్ని గమనించిన ఒక మందుల కంపెనీ మేనేజరు అతనికి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం యిచ్చాడు.

మెడికల్ రిప్రజెంటేటివుగా అయిన తరువాత రామారావు ఆ వూరు వదలి హైదరాబాదు వెళ్లవలసి వచ్చింది. హైదరాబాదులో లలిత అనే హైస్కూలు టీచరును ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె ప్రేమ హడావిడిలో పడి మామ్మగారి సంగతి మరిచిపోయాడు.

చాలాకాలం గడిచింది.

ఒకనాడు రాజమండ్రి క్యాంప్ వెళ్లి నాళంవారి సత్రంలో దిగాడు. ఒక ప్రక్కను అరుగుమీద ఒక నల్లబొంత వేసుకు కూర్చునివున్న ఒక ముసలామెను చూశాడు. ఆమె ఒక బొంతను కుడుతున్నది. దగ్గరకు వెళ్లి చూసి ఆమె నారాయణమ్మగారని గుర్తుపట్టి "మామ్మగారూ" అని ఆమె కాళ్లకు నమస్కారం చేశాడు.

"నువ్వా, రామం" అని ఆమె కళ్లనీరు పెట్టుకుంది.

"మామ్మగారూ. ఏమి టిలా ఇక్కడ ఉన్నారు?"

"ఏం చెప్పను బాబూ. నా కూతురు చనిపోయింది. పిల్లలు లేరుకదా అని అల్లుడు మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. నే నా ఊరు వదలి వచ్చాను."

'మరి మీ ఆస్తి ఉండాలి కదా. ఏముంది మామ్మగారూ?'

"నా కూతురు బ్రతికిఉండగానే ఆస్తి అంతా నగదుక్రింద మార్చేసి మా అల్లుడు సొంతం చేసుకున్నాడు"

"మరి మీవంటిమీద నగలు ఉండాలి కదా" అన్నాడు రామారావు.

"ఒకనాడు మా యింట్లో దొంగలు పడ్డారు" అని ఆమె యింకా ఏమో చెప్పబోతూవుంటే,

"అంటే మీ దగ్గర ఏమీ లేదు కదా అని అమ్మగారు పోయిన వెంటనే మళ్లీ పెళ్లి చేసుకున్నది చాలక మిమ్మల్నిలా ఇల్లు వదిలేటట్టు చేశారా?" అన్నాడు రామారావు.

"అల్లుడిగారి నేమీ అనకు, రామం. నా కూతురున్న స్థలంలో మరొక పిల్ల ఉండడం చూడలేక నేనే వచ్చేశాను. ఆయన నన్ను వెళ్లమనలేదు" అన్న దామె.

"పోనీయండి. ఉండమని బలవంతం చెయ్యవచ్చు కదా" అన్నాడు రామారావు.

"బలవంతం చెయ్యలేదని బాధపడడం వెర్రితనం.",

"ఇంక నాతో వచ్చెయ్యండి మామ్మగారూ. మీ మనవరాలికి సాయంగా ఉందురుగాని."

"ఏదో ఇలా బొంతలు కుట్టుకుని రోజులు గడిపేస్తున్నాను. ఇక్కడే ఉండనియ్యరాదా, బాబూ?" అన్నదామె.

"నేను మీ చేతి అన్నం తిని పెరిగినవాడిని కాదా, మామ్మగారూ. ఆనాడు మీరు చేసిన మహోపకారానికి నేను నా చర్మాన్ని ఒలిపించి మీకు చెప్పులు కుట్టించినా ఆ రుణం తీరదు. నా మాట కాదని నా మనసు బాధ పెట్టకండి. రేపు నాతో హైదరాబాదు వచ్చేయండి" అని బలవంతం చేశాడు రామారావు.

నారాయణమ్మను ఇంటికి తీసుకువచ్చాడు.కాని లలిత అంతగా ఆదరించలేదు. తనతో ముందుగా ఒక మాట అయినా చెప్పకుండా తీసుకురావడం ఆమెకు నచ్చలేదు.

నారాయణమ్మను ఆమె 'మామ్మగారూ' అనిగాని 'అమ్మమ్మగారూ' అనిగాని పిలవలేకపోయింది. 'ఏమండీ' అని మాత్రం అనగలిగింది.

నారాయణమ్మ సోమరిగా కూర్చునే అలవాటులేనిది కావడం వల్ల, ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉండడంవల్ల లలిత ఆమె ఉనికిని కొంత సహించగలిగింది. పొగడడం నారాయణమ్మ స్వభావంలోనే లేదు కనుక లలిత అభిమానం సంపాదించలేకపోయింది

ఎప్పుడైనా లలిత మాట్లాడడానికి అవకాశం యిస్తే,'అమ్మా నీ కడుపున ఒక కాయ కాస్తే నేనెంతో సంతోషిస్తాను" అనేది.

దానితో లలితకు వళ్లు మండేది. వారి పెండ్లయి అయిదు సంవత్సరాలైనా సంతానం కలగకపోవడాన్ని ఎవరూ అంత నిర్భాగ్యమాటంగా ఆమె దృష్టికి తేలేదు. అది పట్నవాసపు తరహా.

"చూడండి. ఆ ముసలిది మనకు సంతానం లేదన్న సంగతి ఎలా దెప్పుతున్నదో" అని భర్తకు ఫిర్యాదు చేసింది.

రామారావుకి చిన్నప్పటి ప్రోగ్రెసు రిపోర్టు ఉదంతం జ్ఞాపకం వచ్చింది.

లలితలాంటి అందమైన అమ్మాయిని పెళ్లాడడం లెక్కలో మాటికి తొంభై తెచ్చుకున్నట్లే. కాని మామ్మగారి దృష్టిలో సంతానం కలిగితేనేగాని ఆ పది మార్కుల వెలితీ తీరదు.

"మామ్మగారు దెప్పడంకాదు. ఆమె మన శ్రేయోభిలాషిణి. రేపే డాక్టరు దగ్గరకు వెళ్లి పరీక్ష చేయించుకుందాము"అన్నాడు.

డాక్టరు పరీక్ష జరిగి మందులు పుచ్చుకున్న తరువాత లలితకు నెల తప్పినది.

ఆ వార్త విన్న నారాయణమ్మ మనస్సులోనే ఎంతో సంతోషించింది. లలిత ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎన్నో సలహా లిచ్చేది. అదంతా లలితకు వెగటుగా తోచేది.

పుట్టబోయే శిశువుకోసం నారాయణమ్మ చిన్నచిన్నలాగులు కుట్టడం, మేజోళ్లు అల్లడం చేసేది.

"చిన్న చిన్న బొంతలు కుడతాను. పాత చీరలియ్యవమ్మా" అని లలితను తొందర పెట్టేది.

ఆమె కోరిక తీరకుండానే 'మామ్మగారికి' ఎంతో జబ్బు చేసింది.

రామారావు చాలా ఆదుర్దా పడ్డాడు. డాక్టరును తీసుకువచ్చాడు.

"నా కెందుకు బాబూ, డాక్టరు?" అన్నది నారాయణమ్మ.

"మామ్మగారు సరిగా చెప్పారు" అన్నది లలిత కసిగా.

"వోల్డేజి కదా. ఏం చెప్పగలం? అయినా హాస్పిటల్‌లో అడ్మిటు చేయండి." అన్నాడు డాక్టరు.

రామారావుకి అందరిమీదా ఒళ్లు మండింది. ముసలితనం వచ్చినంతమాత్రాన జీవించడానికి హక్కు పోతుందా? మనిషి బతికున్నంతవరకు చావకుండా ప్రయత్నం చేయవలసిందేనని నారాయణమ్మను ఆసుపత్రిలో చేర్పించాడు.

Tel. Add: 'VANIJYA' Phone : Office : 5539 Resi : 3873

Channagiri Suryanarayana,
Ghantasala Venkata
Satyanarayana & Co.,

Main Bazar, VIJAYAWADA-1

A P G S T. NO. 643, C.S T. NO. 474/30-4-59

చన్నగిరి సూర్యనారాయణ,
ఘంటసాల వెంకట
సత్యనారాయణ అండ్ కంపెనీ.

పంచులు, పురి, కాయర్ రోప్, టార్పాలియన్సు
ఫెస్టిసైడ్సు, మెన్యూర్స్ & మెట్రిక్ వెయిట్స్ &
మెజర్స్ డీలర్స్

మెయిన్ బజారు, విజయవాడ-1

తనకు చేతనయినంతవరకు 'మామ్మ'గారి సేవ చేశాడు. కాని లాభం లేకపోయింది. ఆమె చివరి క్షణాల్లో 'నాయనా రామం..' అని యింకా ఏమో చెప్పబోతూఉండగా వూపిరి ఆగిపోయింది.

ఆమె అంత్యక్రియలు శాస్త్రోక్తంగా చేశాడు రామారావు.

అటువంటి నారాయణమ్మ స్మృతి చిహ్నంగా నిలచిన ఆ నల్లబొంతను చూసి లలిత అసహ్యించుకుంటోంది.

తాను వారాలు చేసుకునే వాడనీ, తాను చిన్నప్పుడు చేసిన దొంగతనాన్ని నారాయణమ్మ కప్పిపుచ్చి సన్మార్గవర్తిగా చేసిందనీ లలితతో ఎలా చెప్పడమో రామారావుకి తోచలేదు.

* * *

ఈజీ చైరులో కూర్చుని ఆలోచిస్తున్న రామారావుకి ఒక ఆలోచన మెరుపులా తట్టింది. సంతోషంతో లేచి హుషారుగా స్నానాల గదిలోకి వెళ్లాడు.

భోజనాలయాక పనులు ముగించుకుని వచ్చి, "ఇంక బొంత సంగతి చెప్పండి" అన్నది లలిత.

"చెప్పడాని కేముంది. ఆ బొంత నల్లగా ఉండడమే కదా నీకు నచ్చనిది?"

"అంతేకాదు. అది చాలా కుళ్లు బొంత."

"అందుకే మన యిద్దరికీ రాజీమార్గం సూచిస్తున్నాను. ఆ బొంతను విప్పి పైన నల్ల చీరను మార్చేద్దాము. అంతపెద్దగా ఉన్న ఆ బొంతను అయిదారు చిన్న బొంతలుగా తయారు చేద్దాము. ఇవ్వాళ సినిమా ప్రోగ్రాము రద్దు చేసుకుందాము. బొంత కుళ్లదంటున్నావు కనుక ముందు బొంత కుట్లన్నీ విప్పి లోపల గుడ్డలన్నీ వేడి నీళ్లలో ఉడకపెడదాము. ఏమంటావు?" అని ఉత్సాహంగా లలితను చూశాడు రామారావు

"మీ సలహా చాలా బాగుంది" అన్నది లలిత నవ్వుతూ. ఆ నల్లబొంతను గది మధ్యకు ఈడ్చారు.

ఒక్కొక్క కుట్టూ తెంపుతున్నారు.

బొంత కుట్లు సగం విప్పుతూ ఉండగా అతని చేతికి బొంతలోని ఏదో గట్టి పదార్థం తగిలింది అదేమిటా అని దులిపాడు రామారావు. ఒక నల్లని గుడ్డ సంచీ క్రింద పడింది.

ఆ నల్లని గుడ్డ చూసి లలిత అసహ్యించుకుంది. కాని రామారావు అది సంచీ అని గ్రహించి దాన్ని తీసి చుట్టూవున్న దారాన్ని విడదీసి సంచీ బోర్లించాడు అందులోనుంచి ఇదివరకు మామ్మగారి వంటిమీద ఉండే బంగారు ఆభరణాలు క్రింద పడ్డాయి. వాటితోపాటు వంద రూపాయల నోట్ల కట్టలు చిందర వందరగా పడ్డాయి.

లలిత తన కళ్లను తానే నమ్మలేకపోయింది.

"చూశావా, లలితా. బామ్మగారు మనకి ఎంత ఉపకారం చేశారో తన డబ్బుకోసం చూపే అభిమానా లేపాటివో తెలుసుకుని డబ్బుతో నిమిత్తం లేకుండా తనమీద నిజమైన అభిమానం ఉన్న వాళ్లకు ఈ మాత్రమైనా చెందాలని బామ్మగారు ఈవిధముగా దాచి ఉంటారు" అన్నాడు రామారావు.

"అవునండీ. ఆమె గొప్పతనం తెలియక ఏమేమో వాగాను. మనం ఆమె కెంతో రుణపడిఉన్నాం." అన్నది లలిత సిగ్గుపడుతూ.

"అవును. అందుచేతనే పుట్టబోయే మన శిశువు మగవాడైతే నారాయణరావు అనీ, ఆడబిడ్డయితే నారాయణమ్మ అనీ పేరు పెడదాం. ఏమంటావు?" అన్నాడు రామారావు

"అలాగే ముందీ సంచి పెట్టెలోపెట్టి వస్తానుండండి" అంటూ లలిత లేచింది.